## చేనేతపై విధించిన జీఎస్టీని వెంటనే తొలగించాలి

**- కెటిఆర్ పిలుపు మేరకు పీఎం మోడీకి పోస్టుకార్డు రాసిన ఎమ్మెల్యే**

**షాద్‌నగర్, అక్టోబర్ 28, (ప్రభాతవార్త) :**
చేనేత మీద ఆధారపడి ఎన్నో కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని అలాంటి బీద కుటుంబాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని వేయడం సబబు కాదని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం చేనేత మీద కేంద్ర బీజేపీ ప్రభుత్వం విధించిన జీఎస్టీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పీఎం నరేంద్రమోడీకి చేనేత మీద విధించిన జీఎస్టీని రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ పోస్టు కార్డు వ్రాసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేనేత మీద కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని విధించడం చాలా బాధకరమని, ఇప్పటికైన నరేంద్రమోడీ చేనేత మీద విధించిన జీఎస్టీని వెంటనే ఉపసంహారించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు పీఎం నరేంద్రమోడీకి పోస్టు కార్డు వ్రాసి నిరసన తెలుపుతున్నామని ఆయన అన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## పశువులకు లంపి వ్యాధి సోకకుండా చర్యలు తీసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ నిఖిల**



లంపి వ్యాధి నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై గోడ పత్రిక ఎ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిఖిల

**వికారాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:**
పశువులకు లంపి వ్యాది (ముద్ద చర్మవ్యాధి) సోకకుండ అవగాహన, చేపట్టాల్సిన జాగ్రత్తలపై చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ నిఖిల అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్లో లంపి వ్యాధి నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 9 మండలాల్లో 78 పశువులు లంపి వ్యాది బారిన పడ్డాయని తెలిపారు. ఇట్టి వ్యాధి నివారణకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 54 బృంధాలను ఏర్పాటు చేశామని, ప్రతి మండలంలో తిరిగి పశువులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 52 వేల పశువులకు టీకాలు వేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని తెలిపారు. ఈ వ్యాధి కీటకాల వల్ల వ్యాప్తి చెందుతుందని, ముఖ్యంగా గోజాతిలో ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుందన్నారు. మిగతా జీవాలతో పాటు మనుషులకు ఈ వ్యాధి సోకదని స్పష్టం చేశారు. పశువులకు వ్యాధి సోకకుండా వెంటనే సమీప పశువైద్య అధికారిని సంప్రదించి గోట్ పాక్స్ టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య శాఖ అధికారి అనిల్‌కుమార్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి రాంరెడ్డి, కలెక్టర్ కార్యాలయ తహసిల్దార్ హరిత తదితరులు పాల్గొన్నారు.

# రేపు షాద్‌నగర్‌కు జోడో యాత్ర

- భారీగా జన సమీకరణ కోసం జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు ఏర్పాట్లు
- పోటా పోటీగా కటౌట్లు, జెండాల ఏర్పాట్లు



పాతజాతీయ రహదారికి ఇరువైపులా పార్టీ జెండాలు...



షాద్‌నగర్‌కు రానున్న భారత్ జోడో యాత్ర

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబర్ 28, (ప్రభాతవార్త) :**
దేశ వ్యాప్తంగా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు కొనసాగుతున్న భారత్ జోడో యాత్ర ఆదివారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియజకవర్గంలోకి ప్రవేశించనున్నండటంతో జిల్లా కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున జన సమీకరణకు శ్రీకారం చుట్టారు. ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ ఇంఛార్జీలు, మాజీ శాసన సభ్యులు, పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా యువజన కాంగ్రెస్‌తో పాటు కీలక పదవులలో కొనసాగుతున్న నాయకులతో పాటు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు భారత్ జోడో యాత్రను విజయవంతం చేయడానికి గత వారం రోజులుగా బెంగళూరు జాతీయ రహదారి పొడువున భారీగా కటౌట్లను, పార్టీ జెండాలను రోడ్డుకు ఇరువైపుల ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్లపై కూడ రాహుల్ గాంధీ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, తదితర ముఖ్యనేతల ఫోటోలతో కూడిన కటౌట్లను ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం భారత్ జోడో యాత్ర షాద్‌నగర్ నియోజకవర్గంలోని వై జంక్షన్‌కు సాయంత్రం మూడు నాలుగు గంటలకు చేరుకుంటుంది. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వేలాది మందితో రాహుల్ గాంధీకి ఆఖండ స్వాగతం పలకడానికి భారీ జన సమీకరణకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాలతో పాటు మహేశ్వరం, కల్వకుర్తి, షాద్‌నగర్, చేవేళ్ల తదితర నియోజకర్గాల నుంచి ఆయా మండలాలు, మున్సిపల్టీలు నగర పంచాయితీల నుంచి వేలాది మందిని తరలించడానికి స్థానికంగా ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీలు, మండలాల అధ్యక్షులకు బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం ఉప ఎన్నిక జరుగుతున్న మునుగోడు నియోజవర్గంలోని ఆయా మండలాల, గ్రామాల నుంచి వేలాది మందిని షాద్‌నగర్‌లో జరిగే రాహుల్ గాంధీ పాదయాత్ర సభ స్థలానికి తరలించడానికి రాష్ట్ర నాయకత్వం సన్నాహక చర్యలు చేపట్టింది. షాద్‌నగర్‌లో బైపాస్ వై జంక్షన్‌లో రాహుల్ గాంధీ సభ స్థలానికి షాద్‌నగర్ నుంచి అత్యధిక శాతం జన సమీకరణకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. స్థానికంగా ఉన్న పార్టీ నాయకులు సహితం జన సమీకరణ కోసం పార్టీ నాయకులతో సమీక్షలు జరుపుతున్నారు. షాద్‌నగర్ వైజంక్షన్ నుంచి పాతజాతీయ రహదారి మీదుగా నందిగామ, కొత్తూరు, తిమ్మాపూర్, పాలమాకుల వరకు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. వీర్లపల్లి శంకర్ జోడో యాత్ర ఏర్పాట్లను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు.



భారీ సభకు ఏర్పాట్లు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## 12న జాతీయ లోక్ అదాలత్

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్**

**వికారాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:**
న్యాయసేవాసంస్థ ఆద్వర్యం లో నవంబర్ 12 వ తేదీ శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రదాన న్యాయమూర్తి కె.సుదర్శన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీకి ఆమోద యోగ్యమైన కేసులు పరిష్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజీకి ఆమోదయోగ్యమైన కేసులకు సంబంధించి ఇరు పక్షాల కక్షిదారులు రాజికుదుర్చుకునే అవకాశము ఉన్నదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీ మార్గమే రాజమార్గంగా భావించి విలువైన కోర్టు సమయం వృధా కాకుండా, కక్షిదారుల సమయంతో పాటు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు. రాజీపడటము వల్ల ఇరు పక్షాల కక్షిదారులు గెలిచినట్లేనని పేర్కొన్నారు. పంతాలకు పోకుండా రాజీ మార్గాన్ని కక్షిదారులు ఎంచుకుని సద్వినియోగం చేసుకోలని సూచించారు. క్షణికావేశంలో తొందర పాటున పెట్టిన కేసులను వారి తప్పు తెలుసుకుని రాజీపడి కలిసి మెలిసి ఉండేవిదంగా ప్రతి రెండునెలలకు ఒకసారి ఈ జాతీయ లోకదాలత్ నిర్వహించి కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. లోకదాలత్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు, సంబందిత అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు.

## ప్రభుత్వ స్థలంలో రోడ్డు వేయించిన సర్పంచ్,ఎంపిటిసిలు

**-నోటీసులు అందజేసిన తహసీల్దార్**






సోమారం గ్రామంలోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

రోడ్డుపై మట్టివేసి దారి మూసివేసిన రెవెన్యూ అధికారులు

**మేడ్చల్, అక్టోబర్ 28. ప్రభాతవార్త ః**
మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామ పరిధిలో గల ప్రభుత్వ భూమిలో స్థానిక సర్పంచ్‌తో పాటు ఎంపిటిసి కలిసి రోడ్డు వేయించారనే ఆరోపణలో రెవెన్యూ అధికారులు నోటీసులు జారి చేశారు. గ్రామంలోని సర్వేనెంబర్ 18 లో ప్రభుత్వ భూమి ఉంది, ఈ భూమికి ఆనుకుని ఉన్న పక్క స్థలంలో ఓ వ్యక్తి గోదాము నిర్మించాడు. గోదాముకు సక్రమమైన రోడ్డు లేని కారణంగా గోదాముకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో స్థానిక ప్రజా ప్రతినిధులు గతంలో సిసి రోడ్డు వేయించినట్లు ఆరోపనలు ఉన్నాయి. కాగ గత కొంతకాలం క్రితమే ఈ రోడ్డు వేసినప్పటికిని గతంలో ఉన్న రెవెన్యూ అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. కాగా ఇటీవలే నూతనంగా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సరిత ఈ విషయమై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపించి, రోడ్డు వేసిన స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా గుర్తించి, నిర్మించిన సిసి రోడ్డుపై మట్టి వేసి రోడ్డును మూసివేయించారు. అక్కడ ప్రభుత్వ స్థలంగా బోర్డును ఏర్పాటు చేసి, ఈ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలం నుండి గోదాము వరకు సర్పంచ్, ఎంపిటిసిలు కలిసి గోదాము యజమాని వద్ద ఎక్కువ మొత్తంలో డబ్బులు దండుకుని ఈ చర్యలకు పాల్పడ్డారని వీరిపై కఠిన చర్యలు తసీకోవాలని గ్రామానికి చెందిన పలువురు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ రోడ్డు విషయంలో స్పందించిన రెవెన్యూ అధికారులు సర్పంచ్, ఎంపిటిసికి నోటిసులు జారి చేశారు.

**తహసీల్దార్ వివరణ**

మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామంలో సర్వే నెంబర్ 18లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి స్థానిక సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఎంపిటిసి శైలేంద్రి కుమార్‌లు దగ్గరుండి రోడ్డు వేయించారని తమ విచారణలో తేలిందని తహసీల్దార్ సరిత పేర్కొన్నారు. ఈ విషయమై తాము వారికి నోటీసులు జారి చేశామని, చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఉపక్రమిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్‌గా సహదేవ్ బాధ్యతల స్వీకరణ

**-అవినీతి, లంచగొండితనం ఆగేనా..?**

**ఘట్‌కేసర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఎస్. సహదేవ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ కార్యాలయం నుంచి ఆయన ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు. కాగా గత కొన్ని నెలలుగా ఇక్కడ ఇంచార్జ్ ఎస్ఆర్ఓగా డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించిన సోని ఆమె రెగ్యులర్ స్థానం కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. ఈమేరకు సహదేవ్ బాధ్యతలు స్వీకరించి సిబ్బందితో సమావేశమయ్యారు. అయితే గత జూన్ 6వ తేదీన ఇక్కడ పనిచేసిన సబ్‌రిజిస్ట్రార్ సీతారాంనాయక్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడగా జైలుకు వెళ్లి సస్పెండ్‌కు గురయ్యారు. అవుషాపూర్‌లో రెండు గ్రామకంఠం స్థలాలు గిఫ్ట్‌డీడ్ చేయడానికి ఎస్ఆర్ఓ తన వ్యక్తిగత సహాయకుడు కిషోర్ ద్వారా రూ.70 వేలు లంఛం తీసుకొని ఏసీబీకి చిక్కారు. ఆదాయానికి మించి ఆయన ఆస్తులు సంపాధించాడని ఏసీబీ కోర్టులో కేసు నమోదు చేయగా రూ.3,13,80,602 లు విలువైన స్థిర, చరాస్థులు అక్రమంగా సంపాధించినట్లు నిర్ధారించారు. కాగా గత ఐదు నెలలుగా ఇంచార్జ్ ఎస్ఆర్ఓతో భూములు, స్థలాల, భవనాల రిజిస్ట్రేషన్ లావాదేవీలు నిర్వహిస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ సీతారాంనాయక్ ఏసీబీకి పట్టుబడినప్పటికి ఇక్కడి కార్యాలయంలో అవినీతి, లంఛగొండితనం మాత్రం ఆగడం లేదని గ్రామకంఠం, ఎన్ఓసీ, సీలింగ్, అసైనీ భూముల వెంచర్లలోని ప్లాట్లు రిజస్ట్రేషన్ చేయడానికి సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని రియల్టర్లు ఆరోపిస్తున్నారు. కొందరు డాక్యుమెంట్‌రైటర్ల ద్వారా సిబ్బంది పనికి ఇంత అంటూ లంఛాలు గుంజుతున్నారని ఇకనైనా కొత్త సబ్‌రిజిస్ట్రార్ అవినీతికి తావులేకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

# వయో వృద్ధులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**-ప్రత్యేక హక్కులు, చట్టాలను ప్రభుత్వం కల్పించింది**

**-మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్దుల దినోత్సవం సందర్భంగ పలువురు వృద్దులను సన్మానించి అభినందించిన డిఆర్ఓ లింగ్యానాయక్,పాల్గొన్న తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి అక్టోబరు 28, ప్రభాతవార్త**
తల్లితండ్రులుగా ఉన్న వయో వృద్దులను భారంగ భావించకుండ వారికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం వయో వృద్ధులకు హక్కులు, చట్టాలను కల్పించటం జరిగిందని మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయో వృద్దుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు వృద్దులను డిఆర్ఓ సన్మానించి అభినందించారు. జిల్లా మహిళా,శిశు,వయోవృద్దుల,వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్దుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని డిఆర్ఓ లింగ్యానాయక్ పాల్గొని జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగ డిఆర్ఓ లింగ్యానాయక్ మాట్లాడుతూ తల్లితండ్రుల దీవెనల వల్లనే ప్రస్తుతం అందరు ఉన్నతస్థితిలో ఉంటూ మంచి జీవితాన్ని కొనసాగిస్తున్నామన్నారు. తల్లితండ్రులు,గురువులు,పెద్దలు దైవసమానులని వారిని ప్రేమాభిమానాలతో పాటు గౌరవంతో చూడటంతో పాటు వయో వృద్దులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఆయన అన్నారు. వయో వృద్దుల కోసం ప్రభుత్వం హక్కులు,చట్టాలను రూపొందించిందని అన్నారు. ఉమ్మడి కుటుంబాలు ఉన్న సమయంలో వృదాశ్రమాలు లేకపోవటం వృద్దులైన తల్లిదండ్రులను వాటిలో అప్పగించటం వంటివి ఉండేవి కావని ప్రస్తుతం అందరు అనేక కారణాలతో కని పెంచిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వదిలివేయటం ఒకింత భాదాకరంగ ఉందన్నారు. నేటితరం పిల్లలకు స్కూల్స్,కాలేజీల్లో కుటుంబ విలువలు, కుటుంబం పట్ల అవగాహన, తల్లిదండ్రులు,వృద్దుల పోషణ, సంరక్షణ, వారి ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ప్రభుత్వం వృద్దుల సంక్షేమం, వారి పోషణ, సంరక్షణతో పాటు జీవించే హక్కు, ఆస్తిహక్కు, వంటివి పలు హక్కులను తల్లిదండ్రుల,వయోవృద్దుల పోషణ చట్టం 2007చట్టం కల్పించిందన్నారు. తమ హక్కులకు భంగం కలిగితే నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయటం, జాతీయ హెల్ప్‌లైన్ 14567 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని ఆయన అన్నారు. 90ఏళ్లపైబడి జీవిస్తున్నారంటే వారిలో ఉన్న మానసిక ధైర్యం, దృఢత్వం గుర్తించాలని, వారి పట్ల ప్రేమ,దయ,మమకారం చూపుతూ వారి అనుభవాలను తెలుసుకుని ముందుతరాలకు దిక్సూచిగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఆ తరువాత పలువురు వయోవృద్దులను ఘనంగ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి అకేశ్వర్‌రావు,పావని, కుశాయిగూడ ఎసిపి రష్మిపెరమాల్, పేట్‌బషీరాబాద్ ఎసిపి రామలింగరాజు, జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయకుమారి, ఆర్డీఓలు రవి, మల్లయ్య, ఎఫ్ఆర్ఓ సనత్‌కుమార్, శరత్‌కుమార్, సీనియర్ సిటిజన్ కమిటీ మెంబర్ నాగేశ్వర్‌రావు, జిల్లా కమిటీ సభ్యులు, వయోవృద్దులు, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు మరువలేనివి

**- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర**

**- పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సైబరాబాద్‌లో మెగా రక్తదాన శిబిరం**



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీపీ

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబర్ 28, (ప్రభాతవార్త) :**
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల త్యాగలను స్మరిస్తూ సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం, ఉచిత డెంటర్ చెకప్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ క్యాంప్‌ను సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర జాయింట్ సీపీ అవినాష్‌మహంతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అమరులైన పోలీస్ అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ... వారి కుటుంబాలకు పోలీస్ శాఖ తరపున ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. అమరవీరులు సమాజం కోసం దేశం కోసం, రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం ప్రాణత్యాగాలు చేశారన్నారు. వారి త్యాగాలను వెలకట్టలేనివని కొనియాడారు. ప్రతి ఒక్కరు అమరుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాలన్నారు. తలసేమియా, క్యాన్సర్, మెడికల్ ఎమర్జెన్సీ పెషంట్లు, బ్లడ్ కాన్సర్ రోగులు, హిమోఫీలియా, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి, తదితర జబ్బులతో బాధపడుతున్న వారి కోసం ఎక్కువగా రక్తం అవసరం ఉంటుందని సీపీ అన్నారు. రక్తదానం మహాదానమని, రక్తదానంపై అపోహాలు వద్దన్నారు. సైబరాబాద్ పోలీసులు, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, సెంట్రల్ బ్లడ్ బ్యాంక్, నీలోఫర్ చిల్డ్రన్ ఆసుపత్రి, ఎం అండ్ జే కాన్సర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో బ్లడ్ డోనేషన్ జరుగుతుందన్నారు. అదేవిధంగా పోలీసి సిబ్బంది కోసం పాణినీయ డెంటల్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ అవినాష్ మహంతి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ రియాజ్ ఉల్ హక్, సీఎస్‌డబ్ల్యు ఏడీసీపీ వెంకట్‌రెడ్డి, ఏసీపీలు, సీటీసీ డాక్టర్ సుకుమార్, డాక్టర్ సరిత, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి డాక్టర్లు జాన్, డాక్టర్ సరిత, సెంట్రల్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ శ్రవణ్, నీలోఫర్ చిల్డ్రన్ ఆసుపత్రి డాక్టర్ కిరణ్‌మై, ఎం అండ్ జే కాన్సర్ ఆసుపత్రి సుహాసిని, పాణినీయ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ ముసాదక్, డాక్టర్ జోసెఫ్, ఆర్ఐలు తదితర పోలీస్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా పనులు జరపాలి : ఎంపిపి

**- సభకు హాజరు కాని వారికి మెమోలు జారీకి ఆదేశాలు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

**బషీరాబాద్,అక్టోబర్ 28,ప్రభాతవార్త:**
బషీరాబాద్ మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం నాడు సాధారణ సర్వసభ సమావేశం ఎంపిపి కరుణ అజయ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొని మండలం లో జరిగిన పనుల వివరాలను వెల్లడించారు. అనంతరం చైల్డ్ లైన్ అధికారి మాట్లాడుతూ అదర్శ పాఠశాల బషీరాబాద్ (మోడల్ స్కూల్), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నవల్గా. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు పాఠశాల నుండి బస్సు స్టేజి వారకు కాలినడకన వెళ్తున్న అమ్మాయిల పట్ల ఆకతాయిలు అసభ్య కరంగా ప్రవర్తిస్తున్నారని, వారి ఫోటోలు తీసి ఇబ్బంది పెడుతున్నట్లు విద్యార్థుల తల్లితండ్రుల ద్వారా సమాచారం వచ్చినట్లు సమావేశంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. విద్యార్థుల సమస్యలు తీరాలంటే బస్సులు సమయానికి నడపాలని కోరారు. ఎంపిపి కరుణ మాట్లాడుతూ మండల పరిధిలోని పలు గ్రామాలల్లో నిర్వహిస్తున్న అభివృద్ది పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. శుక్రవారం నాడు జరిగిన సర్వసభ సమావేశానికి హాజరు కాని వారికి మెమోలు జారీ చేయాలని బషీరాబాద్ ఎంపిడివో రమేష్‌కు అదేశాలు జారీ చేశారు. కార్యక్రమం ఆయా గ్రామాల సర్పంచ్ లు,ఎంపిటిసిలు,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కెబి దొడ్డి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

**-ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసిన గ్రామస్తులు**

**శంషాబాద్ అక్టోబర్28,ప్రభాతవార్త :** కేబి దొడ్డి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సుల్తాన్‌పల్లి అనుబంధ గ్రామం కేబి దొడ్డి గ్రామస్తులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దండు ఇస్తారి మాట్లాడుతూ..రాయన్నగూడ-కేబి దొడ్డి గ్రామాల మధ్య దెబ్బతిన్న ఆర్ అండ్ బి రోడ్డు మరమ్మతులు,సుల్తాన్‌పల్లి,కేబి దొడ్డి గ్రామాల మధ్య సిసి రోడ్డు మరమ్మతులు ఎంటేరు వాగు కల్వర్టు పునర్నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. కేబి దొడ్డి గ్రామంలో డ్రైనేజీలు,సిసి రోడ్డు నిర్మాణానికి 10లక్షల రూపాయలు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. గ్రామస్తుల వినతిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గ్రామానికి అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానని తెలిపారు. అర్ అండ్ బి రోడ్డు మరమ్మతులు ,కల్వర్టు,సిసి రోడ్డు నిర్మాణానికి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయిస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండు ఇస్తారి పంచాయతీ సభ్యుడు చంద్రశేఖర్,గ్రామస్తులు మల్లికార్జున్, నసీరుద్దీన్,గోపాల్,కశ్యప్ కుమార్,యాదయ్య,బైండ్ల సత్తయ్య,పలువురు మహిళలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన సర్పంచ్,గ్రామస్తులు

## రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులు జరపాల్సిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామలహేమ

సికింద్రాబాద్, అక్టోబర్ 28 ప్రభాతవార్త : చిలకలగూడ నాగులూరి నర్సింహ్మా పార్కు సమీపంలో రూ. 15లక్షలతో జరుగనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం ఈ ప్రాంతాన్ని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామలహేమ పరిశీలించారు. త్వరితగతిన పనుల పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా లోపాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీహెచ్ ఎంసీ అధికారులకు సూచించారు. ఫ్రైడేమార్కెట్ పార్కువద్ద స్థానికుల ఫిర్యాదు మేరకు భారీగా పెరిగిన చెట్ల కొమ్మలను పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి చెట్లకొమ్మలను తొలగించాల్సిందిగా సూచించారు. ఈ కార్యాక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ రఘు, ఏఈ కౌశిక్, నేతలు శ్రీనివాస్‌గౌడ్, టీవీశ్రీనులు పాల్గొన్నారు.

## నెలలు గడుస్తున్నా డ్రైనేజీ లైన్ వేయరా?

ఖైరతాబాద్, అక్టోబరు 28 ప్రభాతవార్త: నెలలు గడుస్తున్నా డ్రైనేజీ పైపు లైన్ వేయడంలో ఇంకెంతకాలం అంటూ స్థానికంగా ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖైరతాబాద్ ప్రాంతంలో ఉన్నటువంటి పురాతన కల్లు కంఫౌండ్ వద్ద ఇరువైపు ఉన్న డ్రైనేజీ పైపులు నామ్ కే వాస్తె అన్నట్లు నెలల తరబడిగా రోడ్డు మీదనే పడేయడం విశేషం. సంబంధిత అధికారులకు ఈ విషయమై అడిగినా ఇప్పుడు అప్పుడు అంటూకాలం వెల్లదీస్తున్నారు. ఇతరులను అడగ్గా బుడగ జంగ బస్తీకి చెందినవని అంటున్నారు. ఎందుకు ఇంతకాలం ఆగి ఉన్నట్లని ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే సంబంధిత శాఖతో మాట్లాడి సమస్య పరిష్కారం చేయాలని స్థానికంగా కొందరు సలహాలిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ డ్రైనేజీ పైపులైన్ పనులు ఇప్పటికైనా చేయాల్సిన అవసరం ఉంది.

## ట్రాఫిక్ నియమాలు

### పాటించకపోతే చర్యలు తప్పవు : గంగారెడ్డి

కంటోన్మెంట్,అక్టోబర్ 28 ప్రభాతవార్త: వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహన చోదకులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఉత్తర మండలి ట్రాఫిక్ ఏసిపి ఏ.గంగారెడ్డి తెలిపారు. గురువారం మారేడ్‌పల్లి కుస్తూర్బాగాంధీ మహిళా కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. వాహన చోదకులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదన్నారు. హెల్మెట్లు తప్పని సరిగా ధరించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను జంప్ చూయకూడదన్నారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్సూ ట్యూట్ ప్రిన్సిపాల్ శంకర్ రాజ్, మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వై.యాదేందర్, ట్రాఫిక్ ఎస్ఐలు రాంచందర్ నాయక్,ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి మాలాధారణ



వివేకానంద్‌నగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో బిక్ష చేస్తున్న అయ్యప్పస్వాములు

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 28, ప్రభాతవార్త : వివేకానంద్ నగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ దేవస్థానం ప్రాంగణంలో అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి మాలా ధారణ చేసిన స్వాములకు బిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అయ్యప్ప మాలాధారణ చేసిన స్వాములకు జనవరి 1వ తేదీవరకు ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు బిక్ష ఉంటుందని స్వాములు పేర్కొన్నారు.

సిఎం కేసిఆర్ పథకాలు దేశంలో ఎక్కడా లేని

## విధంగా అమలౌతున్నాయి : సాయన్న



2వ వార్డు అన్నా నగర్‌లో కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయన్న తదితరులు

కంటోన్మెంట్,అక్టోబర్ 28 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా అమలౌతున్నాయని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే జి.సాయన్న తెలిపారు. శుక్రవారం 2వ వార్డు అన్నా నగర్, అర్జున్ నగర్‌లో 72 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సాయన్న, తిరుమలగిరి తహశీల్దార్ హాసీనా బేగం, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్‌లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ ఆడపిల్లల వివాహానికి వారి తల్లిదండ్రులకు భారం పడకుండా కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకం కింద 1లక్ష 116 రూపాయలను అందజేయడం అభినందనీయమన్నారు. అదే విధంగా ఆసరా పింఛన్లు, దళిత బంధు, రైతు బంధు వంటి పథకాలతో ప్రతి ఏటా లక్షలాది మంది ప్రయోజనం పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు నివేదిత, దేవులపల్లి శ్రీను, మురళీ యాదవ్, పనస సంతోష్, కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు నామకరణ చేయాలి

### నవంబరు 28, 29 తేదీలలో న్యూఢిల్లీలో భారత రాజ్యాంగ రక్షణ మహాధర్నా



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న గజెల కాంతం, పిడమర్తి రవి

సైఫాబాద్ అక్టోబరు 28 ప్రభాతవార్త: ఢిల్లీలో నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ పేరు నామకరణ చేయాలని డిమాండ్ చేస్తూ నవంబరు 28, 29 తేదీలలో ఛలో ఢిల్లీ పేరిట 'భారత రాజ్యాంగ రక్షణ మహ ధర్నా' చేపడుతున్నామని తెలంగాణ ప్రజా సంఘాల జెఏసి, పలు ప్రజా సంఘాలు ప్రకటించాయి. ఈ మేరకు శుక్రవారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ మహ ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను తెలంగాణ ప్రజా సంఘాల జెఏసి చైర్మన్ గజ్జెల కాంతం, రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మించిన సచివాలయంకు సిఎం కెసిఆర్ అంబేద్కర్ పేరును పెట్టడం జరిగిందని, ఆదే విధంగా ప్రధాని నరేంద్రమోదీ కూడా పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. హిందువుల పేరు, శ్రీరాముడు పేరు మీద ప్రజలను దేవుళ్ళను మోసం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. పది రాష్ట్రాలలో ఎమ్మెల్యేలను కోనుగోలు చేసిన బిజెపి తెలంగాణ రాష్ట్రంలో నలుగురు ఎమ్మెల్యేలను కోనుగోలు చేద్దామని ప్రయత్నించి విఫలం చెందారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు ఓరుగంటి వెంకటేశంగౌడ్, వడ్డెముని యోగి, రాపోలు రాములు తదితరులు ప్రసంగించారు.

## బిడ్డను పొట్టన పెట్టుకున్నారు

### ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు



గురుకుల పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న శ్రేష్టవి కుటుంబ సభ్యులు

ఎల్.బి.నగర్, అక్టోబర్ 28 ప్రభాతవార్త: గురుకుల పాఠశాల యాజ మాన్యం నిర్వాకం కారణంగానే తమ కూతురు మృత్యువాత పడిందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గడ్డిఅన్నారం డివిజన్ కృష్ణవేణినగర్ కృష్ణవేణి క్యాంపస్ భవనంలో ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పంతం శ్రేష్ఠవి(15) అనే విద్యార్థిని పాఠశాల భవనం పైనుంచి దూకి మృతి చెందిన సంఘటన విధితమే. ఈ సంఘటనకు సంబంధించి పాఠశాల ప్రిన్సిపాల్ సిబ్బంది చేసిన ఘాతకం వల్లే శ్రేష్ఠవి మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమ కూతురిని పొట్టన పెట్టుకున్న వారిని కఠినంగా శిక్షించాలని తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గురుకుల పాఠశాల వద్ద కుటుంబ సభ్యులు బంధువులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఆందోళన చేస్తున్న వారికి తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మద్దతుగా నిలిచి వారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో ఉదయం ఇడ్లీ తిన్న తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదని శ్రేష్టవి స్వయంగా తమకు చెప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు. పాఠశాల నిర్వాహకుల వేధింపుల వల్ల శ్రేష్టవి చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కట్ట చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

### ఈ నెల 2 నుంచి టూర్ ప్యాకేజీ.. ఆర్.ఎం.సి.హెచ్.వెంకన్న

కంటోన్మెంట్, అక్టోబర్ 28 ప్రభాతవార్త కార్తీక మాసం సందర్భంగా పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతి శని, ఆదివారాల్లో సికింద్రాబాద్ జెబిఎస్, ఇసిఐయల్‌ల నుంచి ప్రత్యేక బస్ సర్వీస్‌లను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసి సికింద్రాబాద్ రీజినయల్ మేనేజర్ సి.హెచ్.వెంకన్న తెలిపారు. శుక్రవారం జెబిఎస్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆర్.వెంకన్న మాట్లాడుతూ జూబ్లీ బస్టేషన్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరి అలియాబాద్‌లోని రత్నాలాయం వర్గల్‌లోని సరస్వతీ దేవాలయం, కొమురవెల్లిలోని మల్లికార్జున స్వామి దేవాలయం, కీసర గుట్టలోని శివాలయం, చేర్యాల్, లక్ష్మీ నర్సింహ్మా స్వామి దేవాలయాల్లో అదే విధంగా ఇసిఐయల్ నుంచి 7.30 గంటలకు వర్గల్ సరస్వతీ దేవాలయం, యాదగిరిగుట్ట, కీసర గుట్ట, టూర్ ప్యాకేజ్ ఉంటుం దన్నారు. పెద్ద వారికి టికెట్ ధర 500 రూ. 12 సంవత్సరాల లోపు పిల్ల లకు రూ.350 టికెట్ ఉంటుందన్నారు. పుణ్యక్షేత్రాలు, (టూర్)కు వెళ్లే ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మానసిక పరివర్తన మానవీయ విలువల రక్షణ ఎంతో అవసరం

### తెలంగాణ రాష్ట్ర శాసనసభ సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి



విజేతలకు లక్షరూపాయల చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి, వకుళాభరణం, బుర్రావెంకటేశం, గౌరీశంకర్, పద్మజారెడ్డి తదితర అతిథులు

రవీంద్రభారతి, అక్టోబరు 28 ప్రభాతవార్త : మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే కళారూపాలను అందించే లక్ష్యం, మానవీయ విలువల పరిరక్షణ, మానసిక పరివర్తన, మానవత్వ కాంక్ష, విశ్వసమతా భావన కోసం ఏర్పడిన విశ్వసాహితీ ట్రస్ట్ రేపటితరం ఆలోచనలను అనుబంధాలకు విలువనిచ్చేలా నిర్మించడం కోసం మానవ సంబంధాలను బలోపేతం, మానవీయ విలువల్ని సుసంపన్నం చేయడం, అనుబంధాలు, ఆత్మీయతలను మనసునిండా నింపేందుకు, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను నేటితరం ద్వారా రేపటితరం హృదయానికి హత్తుకుపోయేలా పరిచయంచేసి పంచేందుకు, సన్మార్గాన్ని సమాజానికి చూపేందుకు విశ్వసాహితీ ట్రస్ట్ కళాయజ్ఞం అపూర్వం, అనితరసాధ్యమని, నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలంగాణ శాసనసభ సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. విశ్వసాహితీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఉదయం నుండి రాత్రి వరకు జరిగిన 3వేల మందితో జరిగిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, సాహిత్య కార్యక్రమాలు, తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి బుర్రా వెంకటేశం రచించిన అమ్మగీసిన బొమ్మ, బతుకమ్మ పాటల వీడియో పోటీల విజేతలకు అవార్డుల ప్రదాన మహోత్సవ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పోచారం శ్రీనివాసరెడ్డి విశిష్ట అతిథులు డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, జూలూరు గౌరీశంకర్, పద్మజారెడ్డి, రాణి కుముదిని, హనుమాన్ చౌదరి, డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి, రాధాకృష్ణ, హరిణి, సాయి చరణ్, పింగళి చైతన్య, బ్రహ్మకుమారీస్ డైరెక్టర్ రాజయోగిని కుల్‌దీప్ దీదీ, బుర్రా వెంకటేశం, విజయేంద్రప్రసాద్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసంచేసి ప్రసంగిస్తూ బుర్రా వెంకటేశం రచించిన పాటలు అందరి హృదయాలకు కదిలించి ఆనంద ఆహ్లాదాలతోపాటు గొప్ప సామాజిక సందేశాన్నీ అందించాయని కొనియాడుతూ ఆయన్ను ఎంతగానో ప్రశంసించి అభినందనలు తెలిపారు. కళలు, సాహిత్యం మనిషిని అభివృద్ధిపథం వైపు నడిపిస్తాయని, విద్యార్థులు ఆయా ఉన్నత ఉత్తమ ఆశయాలతో తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని పోచారం పిలుపునిచ్చారు. అనంతరం శ్రీనివాసరెడ్డి ఇతర అతిథులతో కలిపి అమ్మగీసిన బొమ్మ మొదటి బహుమతిని ఇందిరాప్రియదర్శిని కాలేజీ, ద్వితీయ బహుమతి మహేశ్వరం మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కాలేజీ విజయ నగరం కుసుమిత, తృతీయ బహుమతి కేశంపేట మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల లకు బతుకమ్మ పాట మొదటి బహుమతి లావణ్య గ్రూప్, రెండోబహుమతి ఎంజెపి. సొసైటీ, మూడోబహుమతి రష్యా బ్రహ్మ కుమారీస్‌లకు అవార్డులను ప్రదానం చేశారు. వీడియోలు పంపిన విద్యార్థు లందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం విశిష్ట అతిథులు ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ కళా, సాంస్కృతిక ప్రదర్శనలు విచ్చేసిన అశేష ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొని మంత్రముగ్ధులను చేశాయి.

## టిటిడి డైరీలు, క్యాలెండర్ల విక్రయి ప్రారంభం

సైఫాబాద్, అక్టోబరు 28 ప్రభాతవార్త: తిరుమల తిరుపతి దేవస్థానములు ముంద్రించిన నూతన సంవత్సరం 'క్యాలెండర్లు, డైరీ-2023' అమ్మకం శుక్రవారం లిబర్టి వద్దగల టిటిడి తిరునిలయంలో ప్రారంభమైంది. డైరీ ధర 150 రూపాయలు, నిలువెత్తు శ్రీవారి క్యాలెండర్ 20 రూపాయలు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి 12 పేజీల క్యాలెండర్ 130 రూపాయలు, శ్రీవారు అలివేలుమంగ అమ్మవారి క్యాలెండర్ 20 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎఇఓ జగన్‌మోహనచారి తెలిపారు. ఇదిలా ఉండగా రేపటి (శనివారం) నుంచి ప్రతి శనివారం శ్రీవారి లడ్డు ప్రసాదం తిరునిలయంలో విక్రయించబడునని చెప్పారు. తిరుమల నుంచి ప్రత్యేకంగా లడ్డు ప్రసాదం వస్తుందని, ఒక్కొక్కలడ్డు ధర 50 రూపాయలని ఆయన తెలిపారు.

## హైకోర్టు ఆదేశాల ప్రకారం సింగరేణి యూనియన్‌కు వెంటనే ఎన్నికలు జరపాలి

సైఫాబాద్, అక్టోబరు 28 ప్రభాతవార్త: హైకోర్టు ఆదేశాల ప్రకారం తక్షణమే సింగరేణి యాజమాన్యం, సెంటర్ లేబర్ కమీషనర్ యూనియన్‌కు ఎన్నికలు జరపాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.బోస్ డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో యూనియన్‌కు ఎన్నికలు జరపకుండా యాజమాన్యం రెండు సంవత్సరాల నుంచి తత్సారం చేస్తున్నదని యాజమాన్యం వైఖరిపై సింగరేణి వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆనేక పోరాటాలు, ఉద్యమాలు చేసిందని, లేబర్ కమిషనర్‌ను కూడా ఆశ్రయించినా పట్టించు కోలేదని ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. దీంతో యూనియన్ హైకోర్టును ఆశ్రయించిందని హైకోర్టు పరిశీలించి తక్షణమే ఎన్నికలు జరపాలని ఆదేశించడం జరిగిందని ఆయన తెలిపారు. యూనియన్‌ను వి.ఎస్.బోస్ అభినందించారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన సత్రం ప్రారంభం



అయ్యప్ప స్వామికి హారతి ఇస్తున్న మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి

నిజాంపేట్, అక్టోబర్ 28 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నిజాంపేట్ శ్రీనివాస్ నగర్ కాలనీ అయ్యప్ప దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించి అన్నదాన సత్రాన్ని మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యప్ప దీక్ష తీసుకున్న స్వాములకు మేయర్ అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ కొలన్ చంద్రశేఖర(గురుస్వామి), కార్పొరేటర్ సురేష్‌రెడ్డి,అభిషేక్‌రెడ్డి, వాకలపూడి రంగ రాయ ప్రసాద్, జగన్‌యాదవ్, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## కొడవటిగంటి కుటుంబరావు రచనలు సమతా వాదనలు

చిక్కడపల్లి, అక్టోబరు 28 ప్రభాతవార్త: కొడవటిగంటి కుటుంబరావు రచనలు సమతా వాదనలు, హేతుబద్ధ దృక్పథంతో ఉంటాయనని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో గానసభ నిర్వహణలో ఎందరోమహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సాహితీవేత్త కొడవటిగంటి కుటుంబరావు జయంతి సభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ 'కొకు'గా ప్రసిద్ధిగాంచిన కుటుంబరావు రచనాశైలి విలక్షణమని, సులభ భాషలో లోతైన భావాలను అందిస్తారనని, ఇందుకు చదువు కథ ఉదాహరణ అని అన్నారు. చందమామ పిల్లల కథపత్రికలో పనిచేసిన కాలంలోనూ పిల్లలకు హేతువాద తార్కిక ధోరణిలోనే కథలు అందించేవారని గుర్తు చేశారు.

# అప్పులు తీర్చడం కోసం చైన్‌స్నాచింగ్

### స్నాచర్‌తో పాటు సహకరించిన మహిళ అరెస్టు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిసిపి శిల్పావల్లి

గచ్చిబౌలి, అక్టోబరు 28 ప్రభాతవార్త : చేసిన అప్పులు తీర్చడం, బ్యాంకులో తాకట్టుపెట్టిన వస్తువులను విడిపించడం కోసం ఓ వ్యక్తి చైన్‌స్నాచర్‌గా మారాడు. ఆర్‌సి పురంలో మహిళ మెడలో చైన్ స్నాచింగ్ చేసిన వ్యక్తితో పాటు సహకరించిన మహిళను సైతం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆర్‌సి పురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శుక్రవారం మాదాపూర్ డిసిపి కార్యాలయంలో డిసిపి శిల్పావల్లి వెల్లడించారు... మహారాష్ట్ర పరిధిలోని ముంబయి అంబేద్కర్‌నగర్‌కు చెందిన తుషార్ హీరామాన్ కాంబే(32) నగరానికి వలస వచ్చి అమీర్‌పేటలో నివాసం ఉంటున్నాడు.కాంబేకు గతంలోనే పెళ్లి జరుగగా, ప్రస్తుతం భార్యకు దూరంగా ఉంటున్నాడు. ఇతనికి చందానగర్ హుడా కాలనీలో నివాసం ఉండే మీగడ పద్మలత(30) పరిచయం అయ్యింది. పద్మలతకు గతంలోనే పెళ్లి జరుగగా, భర్తకు దూరంగా ఉంటుంది. కాంబేతో పరిచయంతో ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. కాగా వీరికి అప్పుడు పెరిగిపోవడం, బ్యాంకులో తాకట్టుపెట్టిన వస్తువులను విడిపించుకోవడం కోసం దొంగతనం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా బిహెచ్ఈఎల్‌లో చైన్‌స్నాచింగ్‌కు కాంబే పథకం వేశాడు. ఈనెల 19వ తేదీన సాయంత్రం బిహెచ్ఈఎల్‌లో నివాసం ఉండే మర్రి కనకమహాలక్ష్మి ఈవినింగ్ వాకింగ్ కోసం స్థానికంగా ఉన్న రహదారి మీదకు వచ్చి వాకింగ్ చేస్తుంది. కాగా వెనుక నుంచి వచ్చిన కాంబే మహాలక్ష్మి మెడలో ఉన్న నల్లపూసల దండ, పుస్తెలతాడును స్నాచింగ్ కోసం ప్రయత్నించాడు. నల్లపూసల దండ సగానికి తెగిపోగా, చేతికి చిక్కిన సగం నల్లపూసల దండ, పుస్తెల తాడును తీసుకొని అక్కడి నుంచి పారిపోయాడు. మహాలక్ష్మి కేకలతో స్థానికులు పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో మహాలక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఆర్‌సిపురం పోలీసులు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన కాంబేతో పాటు అతనికి సహకరించిన పద్మలతను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 3.2తులాల బంగారు ఆభరణాలు, 1.3తులాల నల్లపూసల గొలుసు, 6,900రూపాయల నగదు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ప్రతి ఒక్కరు సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి, అక్టోబరు 28 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్ అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సిఐ సంజయ్‌కుమార్ ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సింగారపు రమేశ్‌గుప్త, సహ అన్నదాతలు ప్రొద్దుటూరి నర్సింహారావు, కెవివి.ప్రసాద్‌రావు, సంఘం ప్రధాన కార్యదర్శి చేపూరి లక్ష్మణ్, అదనపు కార్యదర్శి బాలకుమార్, కోశాధికారి చిట్టిమల్ల శ్రీనివాస్, ప్రొజెక్ట్ చైర్మన్ టి.రవి, సింగారపు రమేశ్‌గుప్త, సురేందర్‌గుప్త, బాలచందర్, పి.రమేశ్, జె.నర్సింగరావు, బిక్షపతి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. అన్ని దానాలలోకంటే అన్నదానం గొప్పదని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘం సభ్యులను అభినందించారు.

## గాంధీనగర్‌లో సదర్ సయ్యాట

చిక్కడపల్లి, అక్టోబరు 28 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానంద నగర్‌లో బిజెవైఎం డివిజన్ కార్యదర్శి చిట్టబోయిన సంపత్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సదర్ సమ్మేళనం' కార్యక్రమానికి వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా దున్నపోతుల ప్రదర్శన నిర్వహించే పండుగ సదర్ అని అన్నారు. కార్యక్రమంలో బిజెవైఎం నేతలు ఆనంద్‌రావు, డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, సాయిసంతోష్, జ్ఞానేశ్వర్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పద్మావతినగర్‌లో సీసీ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్

యూసుఫ్ గూడ, అక్టోబర్ 28, ప్రభాతవార్త : చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. శుక్ర వారం పద్మావతినగర్‌లో రూ.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఇప్పటికే కోట్ల రూపాయాలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుల లింగాల ఆయలయ్య, బస్తీ అధ్యక్షులు జావేదుద్దీన్, యోగిరాజు స్వామి, వర్క్ ఇన్స్‌పెక్టర్ వినాయకరావు, నజ్మ, రేణుక, స్వరూపా తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారస్తులను వేధిస్తున్న న్యాయవాది నుంచి రక్షించాలి



బాధితునికి మద్దతు తెలుపుతున్న మహిళలు, ప్రజలు

బేగంబజార్, అక్టోబర్ 28ప్రభాతవార్త: వ్యాపారస్తులను వేధిస్తున్న ఓ న్యాయవాది నుంచి రక్షించాలని కోరుతూ రిసాల అబ్దులా వ్యాపారులు తమ షాపులు మూసి నిరసన తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో ఎక్కడ నూతన భవనం నిర్మిస్తేచాలు ఆ న్యాయవాధి భవనం నిర్మించే యాజమానులకు జిహెచ్ఎంసి ద్వారానోటిసు ఇప్పించడం డబ్బులు ఇవ్వాలని వేధింపులకు తట్టుకోలేక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోణప్రాణాలతో కోట్టుమిట్టాడుతున్నట్లు వ్యాపారులు ఆరోపించారు.నిర్మాణంలో ఉన్నభవనాలపై కేసులు వేయించడం డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారిందన్నారు.న్యాయవాధి వేధింపుల నుండి తమకు రక్షణ కల్పించాలని భాధిత ప్రకాష్‌జైన్ కుటుంబీకులు వాపోయారు.అతనిపై బార్‌కౌన్సిల్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున్న వ్యాపారులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరంలో పాల్గొన్న పోలీసులు



పేట్‌బషీరాబాద్, అక్టోబర్ 28 ప్రభాతవార్త: పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పేట్‌బషీరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో సరోజిని గార్డెన్‌లో రక్తదాన శిభిరాన్ని ప్రారంభించారు. ఈ రక్తదాన శిభిరంలో సీఐ ప్రశాంత్‌తో పాటు 62మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని రక్తాన్ని దానం చేశారు.

## ప్రభుత్వ పాఠశాల సమస్యలపై వినతి

నిజాంపేట్, అక్టోబర్28 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యులు వాణి శుక్రవారం మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి రాజీవ్ గాంధీనగర్ 16వ వార్డు ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన బీజేపీ నేతలు



నాచారం, అక్టోబర్ 28 ప్రభాతవార్త: టీఆర్ఎస్ నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేస్తూ బిజెపి దిష్టి బొమ్మలను దగ్ధం చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ నేతలు నాచారం ప్రధాన రోడ్డుపై సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.బీజేపీ అధ్యక్షులు ప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు పాల్గొని సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చర ఉపాధ్యక్షులు రాగిరి మెహన్ రెడ్డి, ఉప్పల్ మహిళ కన్వీనర్ అనితా రెడ్డి, జిల్లా ఓబీసీ సెక్రటరీ హనుమంత్, బీరధర్, చంద్రమౌళి, శ్రీధర్‌రెడ్డి, దయగౌడ్, పాదం వెంకటేష్, మంజు వాని, అరుణ, వెంకటేశ్వర్లు, రాజు, నాగేష్, పలువురు పాల్గొన్నారు.

## బిజెపి నిరసన

తార్నాక, అక్టోబర్ 28 ప్రభాతవార్త: బీజేపీ దిష్టిబొమ్మల దగ్ధానికి నిరసనగా శుక్రవారం రాత్రి లాలాపేట్ ప్రధాన రోడ్డుపై బీజేపీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన చేశారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ గౌడ్, తార్నాక డివిజన్ అధ్యక్షులు రాము వర్మ, మెట్టుగూడ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్, శ్రీనివాస్ చారి, ఆకుల శ్రీనివాస్, ఉపేందర్ యాదవ్, రాజుజైన్, గోవర్ధన్, విజయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మునుగోడులో షాద్‌నగర్ ఎమ్మెల్యే ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**షాద్‌నగర్, అక్టోబర్ 28, (ప్రభాతవార్త) :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మునుగోడు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు మునుగోడులోని మర్రిగూడ మండలం వెంకిపల్లి గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి తరపున ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల వారికి సరియైన న్యాయం చేస్తున్నారని, ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి బంగారు తెలంగాణగా తీర్చి దిద్దుతున్నారని ఆయన వివరించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను దేశంలోని ప్రతి రాష్ట్రం కోరుకుంటున్నాయని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. మునుగోడు ప్రచారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ వెంట షాద్‌నగర్‌కు చెందిన టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని ప్రచారం నిర్వహించారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబర్ 28,(ప్రభాతవార్త):** ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని మండలంలోని పద్మారం సర్పంచ్ లక్ష్మీసుధ నర్సింహులు అన్నారు. శుక్రవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన సర్పంచ్ విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతో మంది నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. గ్రామాల్లోని పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి బోధన అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిటీసీ రాములు,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు,యాదయ్య,వీరయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

## సదర్ ఉత్సవాలను ఘనంగా జరుపుకుందాం

- అఖిల భారత యాదవ మహాసభ కొందుర్గు మండల అధ్యక్షుడు రవీందర్‌యాదవ్

- జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు

**కొందుర్గు, అక్టోబర్ 28, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ పట్టణంలో జరిగే సదర్ ఉత్సవాలకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి కులాలకు అతీతంగా రావాలని కొందుర్గు మండల అఖిల భారత యాదవ మహాసభ పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు అఖిల భారత యాదవ మహాసభ నాయకులు కొందుర్గు మండల కేంద్రంలో కలుసుకొని అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో చేపట్టనున్న సదర్‌ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకునేందుకు యాదవ సోదరులు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ కొందుర్గు మండల ప్రధాన కార్యదర్శి శివలింగం యాదవ్, మండల కమిటీ నాయకులు రాఘవేందర్‌యాదవ్, గంగన్నగూడ సర్పంచి శేఖర్ యాదవ్, బైకని వెంకటేస్ యాదవ్, వేణుగోపాల్ యాదవ్, ఆంజనేయులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలి



వెంకమ్మగూడ పాఠశాలకు ఫ్యాన్లను అందజేస్తున్న ఎన్జీవోలు

**షాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలని షాబాద్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ తెలిపారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ఎన్జీవోలు ఐడీ కార్డులు, టై బెల్ట్, సౌండ్‌బాక్స్‌లు, గ్రీన్‌బార్డ్, ఫ్యాన్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు రావాలన్నారు. విద్యార్థుల సమస్యలను గుర్తించి పాఠశాలకు ఆర్థిక సహాయం చేసిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ఎన్జీవోలను అభినందించారు. ఈకార్యక్రమంలో దాతలు శ్రీనివాసులు, కుమార్, రాజు, రవి, శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ మద్దూరి శకుంతలపాండు, ఎంపీటీసీ గుత్తి సునీత రామస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సింహ్మాద్రినాయుడు తదితరులు ఉన్నారు.

## చట్టాన్ని పరిరక్షించడమే పోలీసుల కర్తవ్యం



బహుమతులు అందజేస్తున్న ఇన్స్పెక్టర్ గురువయ్య

**షాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త :** చట్టాన్ని పరిరక్షించడమే పోలీసుల కర్తవ్యమని షాబాద్ ఇన్స్పెక్టర్ జి.గురువయ్య తెలిపారు. శుక్రవారం పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల సందర్భంగా షాబాద్ మండల కేంద్రంలో పీఆర్ఆర్ మినీ స్టేడియంలో క్రికెట్, వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... .ప్రజలకు భద్రత కల్పించడమే పోలీసులు ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. ప్రాణాలకు తెగించి సేవలందించే పోలీసులకు నేరాల అదుపుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సైలు సత్యం, బాల్‌రాజ్, మహేశ్వర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శివారెడ్డిపల్లి గ్రామంలో కలెక్టర్ పర్యటన



గ్రామాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిఖిల

**దోమ.అక్టోబర్ 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని శివారెడ్డిపల్లి గ్రామాన్ని శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ నిఖిల ఆకస్మికంగా పర్యటించారు.గ్రామములో ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు.పాఠశాల విద్యార్థులతో పౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ ప్రోగ్రాంపై విద్యార్థులతో ముచ్చటించారు.తరగతి విద్యార్థులను గణితం శాస్త్రంలోని అంశాలను వివరాలు కలెక్టర్ అడుగగా విద్యార్థులు సరైన సమాధానం తెలుపకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.పిల్లల చదువుపై శ్రద్ధచూపాలని,విద్యాభివృద్ధి,అక్షరాస్యత పెంచుటకు కృషిచెయ్యాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.పిల్లలు చదువుపై నిర్లక్ష్యం చెస్తే తల్లి దండ్రులకు సమాచారం అందించాలనితెలిపారు.ఇలాంటి చదువులు పిల్లలకు భవిష్యత్తులో ఉపయోగపడవని,వచ్చెవిద్యాసంవత్సరానికి నాణ్యతతోకూడిన విద్యను అందించటకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని అన్నారు.మనఊరు.మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల తరగతి గదులను పరిశీలించారు.పాఠశాలకు ప్రహరిగోడ,మరుగుదొడ్లు,పెయింటింగ్,కరెంట్,త్రాగునీరు,కిటికీలు,కుర్చిలు ఏర్పాటు వెంటనే పూర్తి చేయించాలని ప్రదానోపాద్యాయులు నర్సిములును ఆదేశించారు.అనంతరం గ్రామంలోని రోడ్లను,మురుగు కాల్వలను, హరిత హారం మొక్కలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుక,డిఆర్‌డివో కృష్ణన్,గ్రామసర్పంచ్ నరేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## రక్తదానం... మరోకరి ప్రాణదానం

- షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్

- షాద్‌నగర్‌లో ఘనంగా అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- ప్రభుత్వాసుపత్రిలో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ కుషాల్కర్.

**షాద్‌నగర్, అక్టోబర్ 28, (ప్రభాతవార్త) :** రక్తదానం చేసి మరోకరి ప్రాణాలను కాపాడాలని షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల స్మసరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం షాద్‌నగర్ సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఏసీపీ కుషాల్కర్ ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విధి నిర్వహణలో ఎందరో పోలీసు అమరవీరులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగాన్ని స్మరించుకుంటూ అమరవీరుల స్మసరణ వారోత్సవాలను జరుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. అమర వీరుల స్మసరణ వారోత్సవాల్లో భాగంగా నేడు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ఈ రక్తదాన శిబిరానికి ఎంతో మంది యువత ముందుకు వచ్చి రక్తదానం చేస్తున్నారని, ఈ సందర్భంగా వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మనం రక్తం దానం చేయడం వల్ల మరో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చునని, ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. అనంతరం రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన చేతుల మీదుగా రక్తదాత పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ నవీన్‌కుమార్, ఎస్సైలు, యువ సత్తా లక్ష్మణ్, కమ్యూనిటీ హాస్పిటల్ డాక్టర్లు, టీఆర్ఎస్ నాయకులు శంకర్, శేఖర్, రాఘవేందర్, శ్రీనివాసులు, యువ నాయకుడు శివ పాల్గొన్నారు.

# దేవాలయాల పునర్నిర్మాణానికి కృషి చేస్తా

-ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ బండి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**తలకొండపల్లి అక్టోబర్28,ప్రభాతవార్త :** కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న దేవాలయాల పునర్నిర్మాణానికి ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామంలో గ్రామస్తులందరితో కలిసి సమావేశం నిర్వహించారు.సందర్భంగా సర్పంచ్ జోలం జయమ్మ వెంకటయ్య ఆధ్వర్యంలో రాఘవేందర్ రెడ్డికి కోలాటాలు,భజన కళాబృందంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం గ్రామంలోని అన్ని వీధుల గుండా గ్రామస్తులు యువకులతో కలిసి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద సర్పంచ్ జోలం జయమ్మ వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న పురాతన ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి 5లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తాం అన్నారు.గ్రామంలోని ఈదమ్మ,పెద్దమ్మ గుడి,కాటమయ్య గుడి,ముత్యాలమ్మ గుడి,పోచమ్మ,చెన్నకేశవ స్వామి,వాల్మీకి దేవాలయాలతో పాటు మొత్తం 10 దేవాలయాలకు 50వేల రూపాయల చొప్పున 5 లక్షల రూపాయలు ఐక్యత ఫౌండేషన్ నుంచి సహాయం చేయనున్నట్లు ఆయన తెలిపారు.గ్రామంలోని యువకుల కోసం క్రికెట్ వాలీబాల్ కిట్లు అందజేస్తానన్నారు.గట్టుఇప్పలపల్లి గ్రామంలో పెద్ద ఎత్తున యువకులు చదువుకున్న నిరుద్యోగులు ఉన్నారని వారి కోసం గ్రంథాలయం ఏర్పాటు కోసం పుస్తకాల కోసం ఒక లక్ష రూపాయలు ఆర్థిక సాయం చేయాలని గ్రామస్తుడు రాజేందర్ కోరడంతో పుస్తకాలను ఇప్పించుకున్నట్లు ఆయన తెలిపారు.ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్చందంగా సేవ చేసేందుకు నిర్ణయించుకున్నాను అన్నారు.కల్వకుర్తి నియోజకవర్గంలో పేదలకు ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని ఆయన ముందు గ్రామస్తులతో అతను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జోలం జయమ్మ వెంకటయ్య,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు వరప్రసాద్ రెడ్డి,సుభాష్,రమేష్ నాయక్,రాఘవేందర్,చంద్రశేఖర్,సర్పంచులు నాగమణి,లింగం,హైమావతి,రామస్వామి,ఈశ్వర్ నాయక్,రాజు నాయక్, గ్రామస్తులు దేవిడ్,రేణురెడ్డి,రాజశేఖర్,లక్ష్మీపతి,భరత్,పాల్గొన్నారు.

# మునుగోడు ఎన్నికల ప్రచారంలో ఘట్‌కేసర్ నేతలు



రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, టిఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిలతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనియాదవ్, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి

**ఘట్‌కేసర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో ఘట్‌కేసర్ ప్రజాప్రతినిధులు, టిఆర్ఎస్‌పార్టీ నాయకులు చురుకుగా పాల్గొంటున్నారు. శుక్రవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి చౌటుప్పల్ మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ టిఆర్ఎస్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, బోడుప్పల్ నగర అధ్యక్షులు మంద సంజీవరెడ్డిలతో పాటు నాయకులు నిత్యం మునుగోడు ప్రచారంలో బిజీగా ఉంటున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆరెగూడెం గ్రామంలో మంత్రితో పాటు ర్యాలీలో పాల్గొని ఓటర్లను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట మేయర్ మేకల కావ్య, జడ్పీటీసీ సభ్యురాలు అనిత, కౌన్సిలర్లు సల్లూరి నాగజ్యోతి, బర్ల శశికళ తదితరులు ఉన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి చౌటుప్పల్ మండలం రెడబావి గ్రామంలో మంత్రి మల్లారెడ్డి, అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమాదేవి, బండారి అంజనేయులు, షేక్‌జహంగీర్, బేతాల నర్సింగ్ రావు, మాజీ ఎంపిటిసి చిలూ క్రి గోపాల్‌రెడ్డి, నాయకులు బర్ల హరిశంకర్, పల్లె విజయ్‌గౌడ్, ఎండి.సిరాజ్ తదితరులు ఉన్నారు.

## వికారాబాద్ జిల్లా బీసీ జేఏసీ కోఆర్డినేటర్‌గా మైల్వార్ వాసి



నియామక పత్రాన్ని అందుకుంటున్న రాము గౌడ్

**బషీరాబాద్,అక్టోబర్ 28,ప్రభాతవార్త:** బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామానికి చెందిన రాము గౌడ్‌ను వికారాబాద్ జిల్లా బీసీ జేఏసీ కోఆర్డినేటర్‌గా నియమించారు.ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ జేఏసీ అధ్యక్షులు ప్రదీప్ గురువారం నాడు హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నియామక పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా రాము గౌడ్ మాట్లాడుతూ బాధ్యతలు అప్పగించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలుపుతూ,బీసీల సమస్యలు పరిష్కరించే దిశగ పని చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ఆయా జిల్లాల వారు ఉన్నారు.

## అక్టోబర్‌లో పెరిగిన చలితీవ్రతతో ఇబ్బందులు

**ఘట్‌కేసర్, అక్టోబర్ 28, ప్రభాతవార్త:** వాతావరణంలో పగటిపూట ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో చలితీవ్రత అధికమవుతున్నది. హైదరాబాద్ నగరానికి చేరువలో ఉన్న ఘట్‌కేసర్ మండలంలో 15 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. ప్రజలు ఉదయం, రాత్రి పూట చలికి గజగజ వణికిపోతున్నారు. నైరుతి ఋతుపవనాలు వెనక్కి వెళ్లిపోవడంతో వాతావరణం చల్లగా మారిపోతుంది. అక్టోబర్ నెలలో పదేళ్లలో ఎప్పుడు లేని విధంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. శీతాకాలం ప్రారంభంలోనే చలి వణుకు పుట్టిస్తోందని పలువురు వాపోతున్నారు. రాబోయే రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని ఇప్పటికే పెరిగిన చలితో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పూట పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు చలితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్టోబర్‌లో బ్యాక్టీరియా, వైరల్ వ్యాధులు పెరిగే ఆస్కారముందని వైద్యులు అంటున్నారు. డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా, వైరల్ ఫీవర్, కంటిప్లూ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.వివిధ పనుల మీద వెళ్లే వారికి ఉదయం, రాత్రి సమయాల్లో బయటకు రావడానికి చలి ఆటంకంగా మారింది. ఘట్‌కేసర్, శివారెడ్డిగూడలో స్వెటర్లు, టోపిలు విక్రయించే దుకాణాలు వెలిశాయి. ద్విచక్ర వాహనాల ప్రయాణికులు చలి నుంచి రక్షణకు జనాలు వెచ్చగా ఉండే స్వెటర్లు, తలటోపిలు, కాళి, చేతిల గ్లౌజెస్‌లు కొనుగోలు చేసి ధరిస్తున్నారు.

## సిసి రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంభం

**చేర్యాల, అక్టోబర్ 28, ప్రభాతవార్త :** చేర్యాల మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు బీడికాలనీలో రూ.18లక్షల వ్యయంతో 600 మీటర్ల సిసి రోడ్లు, డ్రైనేజీ పనులను చైర్మన్ అంకుగారి స్వరూపరాణి, ఆ వార్డు కౌన్సిలర్ ఆడెపు నరేందర్లు కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి తన్నీరు హరీష్‌రావు, జనగామ నియోజకవర్గ శాసన సభ్యులు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి గార్ల సహకారంతో చేర్యాల మున్సిపాలిటి అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు.

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that our client M/s. Shriram City Union Finance Limited, Malkajgiri Branch, Hyderabad is dealing with financing business. In the course of business, **Sri Rapole Madhusudhan Rao, S/o Late R. Vaman Rao,** aged about 48 years, Occupation: Business, R/o. H.No.36, Silver Oak Bunglows, Cherlapally, Uppal, Kapra Mandal, Medchal-Malkajgiri District **and Sri Rapole Pradeep Kumar, S/o Late Vaman Rao,** aged about 45 years, Occupation: Business, R/o Villa No.36, Silver Oak Bunglows, Cherlpally, Uppal, Kapra Mandal, Medchal-Malkajgiri District have approached our client for trade finance and accepted to deposit their title deeds in the respect of the property **SCHEDUE OF PROPERTY:-** All that the Land bearing Plot No.525, in Ganesh Gardens-II, admeasuring 200 square yards or its equivalent to 167.23 square meters, in Survey No.7, 18, 19, 20, 22, 26, 23 Part and 31, Situated at Mangalpally Village, under Adibatla Municipality, Ibrahimpatnam Mandal, Ranga Reddy District and bounded by:- North: Plot No.524, South: Plot No.526, East: Road, West: Plot No.512, as security for the loan availed by them. If any person or persons having any claim or interest in the above property may approach the undersigned within seven days from the date of this publication or else our client will proceed with the transaction.

**M. VANAMA RAJU**
**ADVOCATE, HYDERABAD,**
**Mobile: No.9963874156**

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that our client M/s. Shriram City Union Finance Limited, Secunderabad-II Branch is dealing with financing business. In the course of business, **Sri Aneshetty Jayachandar, S/o. Late Yellaiah,** aged about 44 years, Occupation: Business, R/o. H.No.11-13-43, Road No.1, Near SBH Bank, Alkapuri, Dilsukh Nagar, Saroor Nagar Mandal, Ranga Reddy District, has approached our client for trade finance and accepted to deposit his title deeds in the respect of the property **SCHEDUE OF PROPERTY:-** All that the piece and parcel of the Open Plot bearing Nos.5 and 6, total admeasuring area 397.0 square yards in HMDA approved Layout File No.033456/SMD/LT/U6/HMDA/3001 2020, Date: 18/08/2020 and Layout Permit No.000197/LO/Plg/HMDA/2021, Date: 23/04/2021, in Survey Nos. 129/Part and 131/Part, Situated at Thummaloor Revenue Village and Grampanchyat, Maheshwaram Mandal, Ranga Reddy District and bounded by:- North: Plot No.4, South: Neighbour's Land, East: Neighbour's Land, West: 30'-0" Wide Road, as security for the loan availed by him. If any person or persons having any claim or interest in the above property may approach the undersigned within seven days from the date of this publication or else our client will proceed with the transaction.

**M.VANAMA RAJU**
**ADVOCATE**
HYDERABAD, Mobile: No.**9963874156**

## రేపటితో ముగియనున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్లు

- షాద్‌నగర్ ఓపెన్ డిగ్రీ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి

**షాద్‌నగర్, అక్టోబర్ 28, (ప్రభాతవార్త) :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2022-23 విద్యా సంవత్సరానికి గాను బీఏ, బీకాం, బీఎస్సీ, డిగ్రీ చదువుటకు చేరాలనుకునే వారు రేపటిలోగా ధరఖాస్తు చేసుకోవాలని షాద్‌నగర్ ఓపెన్ డిగ్రీ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్ కావాలంటే రెగ్యూలర్ ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ తస్సమాన పరీక్ష పాసైన వారు అర్హులని, రెగ్యూలర్ డిగ్రీతో సమానమైన ఈ ఓపెన్ డిగ్రీ ఉన్నత విద్య చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. ధరఖాస్తు చేసుకోవాలనుకున్న వారు మీ సేవ సెంటర్లలో లేదా ఏదైనా ఆన్‌లైన్ సెంటర్లలో యూనివర్సిటీ వైబ్‌సైట్ ద్వార దరఖాస్తు చేసుకోవచ్చు అని ఆయన పేర్కొన్నారు. ఇతర వివరాలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఓపెన్ డిగ్రీ సెంటర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## మునుగోడులో ప్రచారంలో జడ్పిటిసి విశాలశ్రావణ్‌రెడ్డి



మునుగోడులో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి.

**షాద్‌నగర్, అక్టోబర్ 28, (ప్రభాతవార్త) :** మునుగోడు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా మంత్రి కేటీఆర్ ఇంచార్జీగా వ్యవహరిస్తున్న గట్టుప్పల్ గ్రామంలో షాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం జడ్పీటీసీ, మహిళ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి శుక్రవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఓట్లకు టీఆర్ఎస్ పార్టీ గుర్తును చూపిస్తు ఓటర్లను టీఆర్ఎస్‌కు ఓటు వేయాలని సూచిస్తున్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామంలో ఇంటి ఇంటికి తిరుగుతూ టీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తూ ప్రజలను చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మహిళ నాయకురాలు, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉయ్యాల వేడుక కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే

**శంకర్‌పల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ గోవింద్‌రెడ్డి మనవడి ఉయ్యాల వేడుక కార్యక్రమానికి చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నం హాజరయ్యారు. అనంతరం చిన్నారి తల్లిదండ్రులు సాయికిరణ్‌రెడ్డి, స్నేహ దంపతులను ఆయన ఆశీర్వాదించారు. మాజీ ఎమ్మెల్యే వెంట కొండకల్ ఎంపీటీసీ బద్దం సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ధర్మన్నగారి వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## శంకర్‌పల్లిలో ఘనంగా సదర్ వేడుకలు



సదర్ ఉత్సవ వేడుకలు

**శంకర్‌పల్లి, అక్టోబర్ 28, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్ వార్డులో ఘనంగా సదర్ ఉత్సవాలు జరిగాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఉత్సవాల్లో ఒకటైన సదర్ వేడుకలను కౌన్సిలర్ లక్ష్మమ్మరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతియేట యాదవుల కుల దైవమైన కృష్ణుడి ఆశీర్వాదంతో దున్నపోతులను అంగరంగ వైభవంగా అలంకరించి ఆటపాటలతో డప్పుచప్పుళ్లతో ఊరంతా ఊరేగించడం అనవాయితీ అని నిర్వాహకులు తెలిపారు.

## ఎమ్మెల్యేతో పాటు టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలి

-గుర్రం అనంతరెడ్డి డిమాండ్

**శంషాబాద్ అక్టోబర్28,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ నియోజకవర్గం రాష్ట్ర రాజధానికి కూత వేటు దూరంలో ఉన్నప్పటికి అభివృద్ధికి ఎంతో వెనుకబడి ఉన్నదని ఈ ప్రాంతం కూడా త్వరిత గతిన అభివృద్ధి చెందాలంటే స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో పాటు టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని శంషాబాద్ మండల సీనియర్ నాయకుడు చిన్న గోల్కొండ సహకార సంఘం డైరెక్టర్ గుర్రం చిన్న అనంతరెడ్డి డిమాండ్ చేశారు.శుక్రవారం శంషాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఇన్నర్ రింగ్ రోడ్డు,ఔటర్ రింగ్ రోడ్డు ఉన్నప్పటికి అభివృద్ధికి మాత్రం నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామాలు మున్సిపల్ ప్రాంతాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న విధంగా ఉన్నాయని ఈ సమస్యలన్ని తీరాలంటే కారు గుర్తు మీద గెలిచిన ప్రజాప్రతినిధులు అందరూ తమ పదవులకు రాజీనామా చేస్తే హుజూరాబాద్,మునుగోడు మాదిరిగా వందల కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తారని అనంతరెడ్డి అన్నారు.నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో కూడా రోడ్ల వ్యవస్థ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నదని వీటి గురించి పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ప్రజలు తమ గోడు ఎవరికి చెప్పాలో అర్థం కాక కుమిలిపోతున్నారని అనంతరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో టిఆర్ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడుతూ పేద ప్రజలకు 60 గజాల స్థలం కూడా ఇవ్వడం లేదని అన్నారు.ప్రభుత్వ భూములను కబ్జా చేసి పట్టాలుగా మార్చుకుంటున్నారని పేద ప్రజల చేతిలో ఉన్న ప్రభుత్వ భూములను మాత్రం పిఓటి చట్టం కింద లాక్కుంటున్నారని తెలిపారు.భూములు ఎక్కడెక్కడ కబ్జాలు జరిగాయో సాక్షాదారాలతో నిరూపిస్తానని సవాల్ చేశారు.టిఆర్ఎస్ పార్టీ నాయకులకు అభ్యంతరం ఉంటే శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో చర్చకు సిద్ధం కావాలని అనంతరెడ్డి సూచించారు.

## బిజెపి దక్షిణ భారత ఇంచార్జీ అరవింద్ మీనన్‌ను కలిసిన వీటి విజయ్ కుమార్

**శంషాబాద్ అక్టోబర్28,ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ దక్షిణ భారతదేశ ఇంచార్జీ తెలంగాణ రాష్ట్ర బిజెపి అడ్వైజర్ అరవింద్ మీనన్‌ను పార్టీ ముఖ్యనాయకుడు వీటి విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.మునుగోడు ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన ఆయనను బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతితో కలిసి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు.ఆయనకు శాలువా పూలమాలతో సన్మానించిన అనంతరం ఆయనతో కలిసి మునుగోడు ఎన్నికల ప్రచారానికి తరలివెళ్లారు.అరవింద్ మీనన్ బిజెపిలో అతి ముఖ్యనాయకుడు వ్యూహకర్త అని విజయ్ కుమార్ తెలిపారు.



అరవింద్ మీనన్‌ను కలిసిన వీటి విజయ్ కుమార్,తదితరులు

# సగరుల న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలి

**- మంత్రి హరీష్‌రావును కలిసిన రాష్ట్ర సగర సంఘం నాయకులు - డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన మంత్రి**

**షాద్‌నగర్, అక్టోబర్ 28, (ప్రభాతవార్త) :**
తెలంగాణ రాష్ట్రంలో సగరులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కారించాలని కొరుతూ తెలంగాణ సరగ సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును కలిశారు. రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘం నాయకులు శుక్రవారం మంత్రిని కలిసి తమ డిమాండ్లను వివరించారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీ డీ లో ఉన్న సగరులను బీసీ ఏ లోకి మార్చాలని, నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న సగరులను నిర్మాణ రంగ కార్మికులుగా గుర్తించాలని, గతంలో ఇచ్చిన జీఓ 29ను పునరుద్ధరిస్తూ సగరులకు ప్రభుత్వ కాంట్రాక్ట్ పనులలో 15 శాతం పనులను రిజర్వేషన్ ద్వారా దరావతు సొమ్ము లేకుండా ఇవ్వాలని కోరారు. 60 సంవత్సరాల వయస్సు పైబడిన సగరులకు పెన్షన్ పథకం అమలు చేయాలని వారు హరీష్‌రావును కోరారు. ఆత్మ గౌరవ భవనం కోసం కోకాపేటలో ముందుగా కేటాయించిన స్థలాన్ని కొనసాగిస్తూ కోకాకోట స్థలం మార్చకుండా ముందు కేటాయించిన స్థలాన్ని కొనసాగించే విధంగా చర్యలు తీకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వ కాంట్రాక్టు పనులలో రిజర్వేషన్లు పై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామ తెలిపారు. ఇతర సమస్యలు పరిష్కారంచడానికి


హరీష్‌రావుకు తమ డిమాండ్లను వివరిస్తున్న రాష్ట్ర సగర సంఘం నాయకులు

ముఖ్యమంత్రితో చర్చించి పరిస్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, కోశాధికారి నలుబాలు భిక్షపతి సగర, గౌరవ రాష్ట్ర ముఖ్య సలహాదారులు ఆర్.బి. ఆంజనేయులు సగర, రాష్ట్ర, జిల్లా స్థాయి సగర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా సురంగల్‌లో సదర్ సమ్మేళనం

**-ఆకట్టుకున్న దున్నపోతుల విన్యాసాలు**
**-సద్దర్‌తోనే యాదవుల ఐక్యత, ఏర్పడుతుంది**
**-ఆల్‌ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్యాగరి రాజు**

**మొయినాబాద్, అక్టోబర్ 28, ప్రభాతవార్త :**
మొయినాబాద్ మండలంలోని సురంగల్ గ్రామంలో జోరుగా యాదవ కులస్థులు సద్దర్ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు, గురువారం రాత్రి సురంగల్ గ్రామంలో యాదవులు గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సదర్ సమ్మేళనం ఆనవాయితికగా ఈ సంవత్సరం కూడ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో గ్రామంలోని పెద్దలు అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు, సదర్ సయ్యాటతో గ్రామం అంతా హోరెత్తింది, దున్నపోతులను అందంగా ముస్తాబుచేసి అలంకరించారు. యాదవ యువకులు దున్నపోతులతో చేసిన విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. బ్యాండు మేలాలతో, డీజే సౌండ్‌లతో, యాదవులు, వారి బంధువులు, కర్రసాము, కత్తిసాములు చేశారు, యాదవుల విన్యాసాలను తలకించడానికి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు, ఈ సందర్భంగా బ్యాగరి రాజు మాట్లాడుతూ సదర్ సమ్మెలనంతోనే యాదవుల ఐక్యత ఏర్పడుతుందని అన్నారు, ఆ నాడు నిజాం నిరంకుష పాలనను అంతమొందించే దిశగా యాదవులు అందరు కలిసి ఒక దాటిపైకి వచ్చి తిరుగుబాటు చేసారన్నారు, నాటి నుండి నేటి వరకు



సదర్‌తో ఉత్సవాలతో యాదవులు ఒకదాటి పైకి వస్తున్నారని తెలిపారు, నాడు యోదో వంశ రాజులో ఈ నాడు యాదవులని, యాదవ జాతికి ఎంతో గోప్ప చరిత్ర ఉందని నేటి యాదవులు, యువకులు వారి చిరిత్ర వారు తెలుసుకోవాల్సిన అవసం ఎంతో ఉందని అన్నారు, యాదవులంటేనే మంచికి మారుపేరని అన్నారు, అనంతరం యాదవ సంఘం నాయకులు గ్రామంలోని వివిధ కూలాలకు చెందిన వారిని వేధిక పైకి ఆహానించి సన్మానించారు, ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు, నాయకులు, నిర్దుల మహేందర్ రెడ్డి, గడ్డం వెంకట్ రెడ్డి, గుమ్మాల సీతారాం రెడ్డి, సోమ శ్రీను యాదవ్, మ్యాకల మల్లేష్ యాదవ్, జ్ఞానేశ్వర్ యాదవ్, పాండు యాదవ్, తధితరులు పాల్గోన్నారు,

# చీకటి దందాలలో తాండూరు ఎమ్మెల్యే పేరు హైలెట్ .!

**- ఎమ్మెల్యేల కొనుగోలు సీన్ కట్టు కథ**
**- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి దమ్ముంటే కుట్రను నిరూపించాలి**
**- లేదంటే తాండూరు ప్రాంతంలో అడుగడుగునా అడ్డుకుంటాం**
**- బిజెపి జిల్లా అధ్యక్షులు సదానందరెడ్డి**

**తాండూరు, అక్టోబరు 28, ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్రంలో ఏ చీకటి వ్యాపారం బయటపడినా అందులో తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేరు హైలెట్‌గా మారుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు సదానందరెడ్డి విమర్శించారు. శుక్రవారం తాండూరులోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సదానందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్‌కుమార్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీ కృష్ణగౌడ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యేల కొనుగోలు సీన్ టిఆర్ఎస్ ఆడుతున్న కట్టుకథ అని కొట్టిపాడేశారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి దమ్ముంటే ఎమ్మెల్యేల కొనుగోలు కుట్రను నిరూపించాలని సవాల్ చేశారు. లేదంటేతాండూరు ప్రాంతంతలో తిరగ కుండా అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో సంచలం రేపుతున్న అక్రమదందాలు, చీకటి వ్యాపారాలలో నిత్యం ఏదో ఓ కేసులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేరు మారుమోగుతుందని విమర్శించారు. ఎమ్మెల్యేల కొనుగోలు కుట్ర పేరుతో టిఆర్ఎస్ పార్టీ దిగజారుడు రాజకీయాలు చేసస్తుందని అన్నారు. ఎమ్మెల్యేల కొను


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు.

గోలు కుట్రలో నిజ నిజాలు ప్రభుత్వ బహిర్గతం చేయాలని సవాల్ చేశారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పార్టీ మారితే రూ. 100కోట్లు ఇస్తామని బీజేపీపై నిరాధార అరోపణలు చేస్తున్నారని అన్నారు. పార్టీలు మారీ రూపాయికి పనిలేని ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి బీజేపీకి లేదన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్, గుట్కా, మట్కా, కాసినో, బియ్యం, ఇసుక తదితర చీకటి దందాలలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేరు మారుమోగుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని మోసం చేసి టీఆర్ఎస్‌లో చేరి మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. అభివృద్ధి పేరుతో తాండూరు ప్రాంత యువతను, ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. జరిగిన సంఘటనపై సిబీ, సిఐడి ద్వార విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంతారం లలిత, కౌన్సిలర్ బాలప్ప, నాయకులు బంటారం భద్రేశ్వర్, పూజారి పాండు, రజనీకాంత్, కిరణ్, సందిప్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

**-అత్యవసర పనులు చేపట్టేందుకు సభ్యుల ఆమోదం**

**కొడంగల్,అక్టోబర్ 28ప్రభాతవార్త**
మున్సిపాలిటీ పరిధిలో ప్రణాళికా బద్దంగా అభివృద్ధి పనులను చేపడుతు కొడంగల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేద్దామని మున్సిపల్ చెర్మెన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్దానిక వెటర్నిరి ఆసుపత్రి సమావేశపు హాల్‌లో మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెర్మెన్ మాట్లాడుతు మున్సిపల్ పరిధిలో అత్యవసర పరిస్థితుల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. ప్రధానంగా గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో పలు ప్రాంతాల్లో మొరం పనులు చేపట్టాలని తెలిపారు. అలాగే గుండ్లకుంటలో అసంపూర్తిగా మిగిలిన సీసీ రోడ్డు రూ.5లక్షల వ్యయానికి సంభందించి నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. మున్సిపల్ సిబ్బంది వేతనాలు ఇతరాత్ర అవసరాలను సమకూర్చాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో అత్యవసర పనులు చేపట్టేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చెర్మెన్ ఉషారాజేందర్, మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

## జూకల్‌లో అయ్యప్ప సన్నిధాన నిర్మాణానికి విరాళం


విరాళం చెక్కును అందజేస్తున్న జడ్పిటిసి నీరటి తన్విరాజు ముదిరాజ్

**శంషాబాద్ అక్టోబర్28,ప్రభాతవార్త :**
శంషాబాద్ మండలంలోని జూకల్ గ్రామంలో అయ్యప్ప భక్తులు ఉండడం కోసం నిర్మించే సన్నిధానం నిర్మాణం కోసం స్థానిక జడ్పిటిసి నీరటి తన్విరాజు ముదిరాజు మూడు లక్షల 50వేల రూపాయలను విరాళంగా అందజేశారు. శుక్రవారం ఉదయం ఆయనను కలిసి అడిగిన వెంటనే చెక్కు రూపంలో విరాళాన్ని అందజేశారని జూకల్ గ్రామ సర్పంచ్ కోడూరు నరసమ్మ, ఉప సర్పంచ్ మన్నే మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పాలమాకుల సింగిల్ విండో వైస్ చైర్మన్ పోరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకుడు కోడూరు సత్యానందం గ్రామపంచాయతీ సభ్యులు అయ్యప్ప భక్తులు తెలిపారు. అడిగిన వెంటనే విరాళం ఇచ్చిన తన్విరాజు ముదిరాజ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్ షోలో పాల్గొన్న బుక్క వేణుగోపాల్


రోడ్ షోలో ఈటలతో కలిసి పాల్గొన్న బుక్క వేణుగోపాల్

**శంషాబాద్ అక్టోబర్28,ప్రభాతవార్త :**
మునుగోడు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం గట్టుప్పల్ మండలంలోని వెలుమ కన్నె గ్రామంలో భారతీయ జనతా పార్టీ రోడ్ షో నిర్వహించారు. బిజెపి అభ్యర్థి కొమటిరెడ్డి వెంకటరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఈటల రాజేందర్ నిర్వహించిన రోడ్ షోలో రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకుడు బుక్క వేణుగోపాల్ పాల్గొన్నారు. కమలం గుర్తుపై ఓటు వేసి రాజగోపాల్ రెడ్డిని భారీ మోజార్టీతో గెలిపించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అక్రమంగా దోచుకున్న డబ్బులతో కెసిఆర్ కుటుంబానికి కన్ను మిన్ను కనిపించడం లేదని అహంకారంతో విర్రవీగుతున్నారని ఈ ఎన్నికల్లో ఓటు అనే అస్త్రంతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మునుగోడు నియోజకవర్గంలో టిఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి పరిమితం అవుతుందని దీనితో భయం పట్టుకున్న కెసిఆర్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినట్లు డ్రామాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు జిమ్మిక్కులు వేయడం కెసిఆర్‌కు అలవాటేనని ప్రజలు గ్రహించారని ఈటల రాజేందర్, బుక్క వేణుగోపాల్ అన్నారు. టిఆర్ఎస్ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసిన ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన విజ్ఞులైన ఓటర్లు కమలం గుర్తుకు ఓటు వేసి బిజెపిని గెలిపించాలని కోరారు.

## వచ్చే నెల 4న కొడంగల్‌లో సదర్ కార్యక్రమం


విలేకరులతో మాట్లాడుతున్న గొల్ల కురుమల సంఘం నాయకులు

**కొడంగల్ రూరల్, అక్టోబరు 28 (ప్రభాతవార్త):**
నియోజకవర్గ కేంద్రం కొడంగల్‌లో నవంబర్ 4న సదర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గొల్ల కురుమల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మధుసూదన్‌యాదవ్, సంఘం నాయకులు డాక్టర్ రవీంద్రయాదవ్, విజయ్‌కుమార్, రామకృష్ణ, నర్సిములు, నర్సింహ్మ తదితరులు తెలిపారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని గొల్ల కురుమలు అధిక సంఖ్యలో తరలి వచ్చి సదర్‌ను విజయవంతం చేయాలని కోరారు.

## మునుగోడు ప్రచారంలో కొడంగల్ నాయకులు

**కొడంగల్,అక్టోబర్ 28ప్రభాతవార్త**
నల్గొండ జిల్లా మునుగోడు ఉపఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అద్వర్యంలో కొడంగల్ మండల టీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. శుక్రవారం మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నెర్మేట, కొండారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో టీఆర్ఎస్ అభ్యర్థి కూచుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తనయుడు, మండల సర్పంచ్‌లు సంఘం అధ్యక్షులు రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు సయ్యద్ అంజద్, కొడంగల్, కోస్గీ పీఏసీఎస్ అధ్యక్షులు కట్కం శివకుమార్‌గుప్త, భీంరెడ్డి, నారాయణపేట్ జిల్లా గ్రంధాలయ సంస్థ చెర్మెన్ శ్యాసం రామకృష్ణలతో పాటు చిన్న నందిగామ టీఆర్ఎస్ నాయకులు సాయిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం జరిగిందన్నారు. మునుగోడుల ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని తెలిపారు.


మునుగోడు ఉపఎన్నికల్లో ప్రచారంలో పాల్గొన్న కొడంగల్ మండల టీఆర్ఎస్ నాయకులు

# సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించాలి

**-ఎస్బీఐ బ్యాంకు మేనేజర్ కిరణ్**

**కొడంగల్,అక్టోబర్ 28ప్రభాతవార్త**
బ్యాంకులో తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని తిరిగి సకాలంలో బ్యాంకుకు చెల్లించి అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఎస్బీఐ కొడంగల్ శాఖ బ్యాంకు మేనేజర్ కిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో బ్యాంకు ఖాతాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే రైతులు, మహిళా సంఘాలు బ్యాంకు నుంచి పొందిన వారు సకాలంలో రుణాలు తిరిగి చెల్లిస్తే తక్కవ వడ్డీ(7శాతం) మాత్రమే వర్తిస్తుందన్నారు. అంతేగాక బ్యాంకు ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లిస్తే అదనంగా మరికొంత మందికి రుణాలు అందించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం బ్యాంకు ద్వారా పొంది సకాలంలో చెల్లించిన అప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఖాతాదారులు రాములగౌడ్, కిషన్‌సింగ్, మోతీభాయి, సురేఖభాయిలతో పాటు పలవురు రైతులు, మహిళా


రుణాలు సకాలంలో చెల్లించిన మహిళలను సన్మానిస్తున్న బ్యాంకు మేనేజర్

సంఘాల మహిళలను బ్యాంకు మేనేజర్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ బ్రహ్మనరేష్, గ్రామసర్పంచ్ గీతాఠాకూర్‌లతో పాటు గ్రామ రైతులు, మహిళా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు కళలను నేర్చుకోవాలి

**-బాలానగర్ డిసిపి సదీప్ గోనె**
**-డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నాట్యం, కళల పోటీలు**

**మేడ్చల్, అక్టోబర్ 28. ప్రభాతవార్త :**
విద్యార్థి దిశలో చదువుతో పాటు వివిద కళలు నేర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అదిరోయించగలుగుతారని బాలానగర్ డిసిపి సందీప్ గోనె అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని డిఆర్ఎస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో అంతర్ పాఠశాలల నాట్యం, కళల పోటీలను మ్యూజికల్ మిస్టరీ పేరుతో శుక్రవారం పాఠశాల యాజమాన్యం నిర్వయించారు. నగరంలోని 30 పాఠశాలల నుండి ఎంపికైన 500 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సినిమా పాటలు, నృత్యాలతో సంబందం లేకుండ తమదైన స్వంత శైలిలో పాటలు పాడి నృత్యాలు చేసి నూతన ఒరవడులు సృష్టించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి డిసిపి మాట్లాడుతూ ప్రజలను ఎక్కువగా ఆకర్షించే సంగీతం, నాట్యం కళల్లో విద్యార్థులు సృజనాత్మకత ప్రతిభను కనబర్చి ముందుకు సాగితే అపూర్వమైన అవకాశాలు మెండుగా వస్తాయని ఆయన అన్నారు. విద్యార్థులు టాలివుడ్, బాలివుడ్, హాలివుడ్ సంగీతాన్ని, పాటలను అనుసరించకుండా తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లో పాడిన విభిన్నమైన పాటలు విద్యార్థుల ఆలోచనలను సృజనాత్మకతను వెలికి తీశాయని అన్నారు. కళలను ప్రోత్సహించడానికి నృత్యం పాట విలువను ప్రజలకు వివరించాల్సిన



నృత్యం ఆలపించిన విద్యార్థులు

అవసరం ఎంతైన ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు విభిన్న నృత్యరీతులతో చేసిన బ్యాలెట్, వెస్ట్రన్, ట్యాప్, మోడ్రన్, క్లాసికల్, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దయానంద్ అగర్వాల్, డైరెక్టర్లు గార్వ్ అగర్వాల్, అంజనీ కుమార్ అగర్వాల్, వైస్ ప్రిన్సిపల్ దిల్లోన్, స్కూల్ హెడ్ ఆఫ్ ఆర్ట్స్ ధవళ్ చెందే, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

**-మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి**


మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్

**కొడంగల్,అక్టోబర్ 28ప్రభాతవార్త**
ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటుతు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ చెర్మెన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మహదేవుని ఆలయ ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చెట్లను నాటడం ద్వారా అవి పెరిగి వృక్షాలుగా ఎదిగి మనందరిని కాపాడుతాయన్నారు. చెట్లు నాటడం ద్వారా సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి వాతావరణ కాలుష్యం లేకుండా చేస్తాయన్నారు. ఇందుకుగాను ప్రతి ఒక్కరు తమ ఇళ్ళ ముందు, ఖాళీ ప్రదేశాలు, పాఠశాలల ఆవరణలు, పొలాల గట్లపై మొక్కలు నాటడడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రమేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## బహదూర్ గూడ భూసమస్యను పరిష్కరించండి

**-సింగిల్ విండో డైరెక్టర్ జీవన్ గౌడ్**

**శంషాబాద్ అక్టోబర్28,ప్రభాతవార్త :**
శంషాబాద్ మండలం పరిధిలోని బహదూర్ గూడ భూ సమస్యను వెంటనే పరిష్కరించి రైతులకు పట్టాదారు పాసు బుక్కులను అందజేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిన్న గోల్కొండ సింగిల్ విండో డైరెక్టర్ జీవన్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గత అనేక సంవత్సరాలుగా బహదూర్ గూడ భూవివాదం కొనసాగుతున్నదని రైతులకు పాస్ బుక్కులు అందజేస్తామని ప్రజాప్రతి నిధులు అధికారులు అనేకసార్లు హామీలు ఇచ్చిన్నప్పటికి ఆచరణలో మాత్రం ముందుకు సాగడం లేదని ఆయన అన్నారు. దాదాపు 30 సంవత్సరాలుగా రాజకీయ నాయకులు రైతులను మభ్యపెడుతూ కేవలం వారిని ఓటు బ్యాంకు గా ఉపయోగించుకుంటున్నారని జీవన్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఈ సమస్యతో సతమతమవుతూ దిక్కు తోచని స్థితిలో దీనావస్థలో ఉన్నారని అన్నారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తా మని పదే పదే చెప్పుకుంటున్నప్పటికి చిత్తశుద్ధితో వ్యవహరించకపోవడం వల్లనే సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీ జోడో యాత్రకు తరలిన నాయకులు


పరిగి కేంద్రంలో జోడో యాత్రకు బయలు దేరిన టి.రాంమోహన్‌రెడ్డి, నాయకులు

**పరిగి అక్టోబర్ 28, ప్రబాతవార్త :**
కాంగ్రెస్ పార్టి పేద ప్రజల అభ్యున్నతి కోసం రాహుల్ గాంధి చేపట్టిన జోడో యాత్ర ముమ్మరంగా సాగుతుంది. శుక్రవారం యాత్ర మహబూబ్‌నగర్ జిల్లా మన్నెంకొండకు చేరుకోవడంతో పరిగి కుల్కచర్ల కు చెందిన కాంగ్రెస్ పార్టి నాయకులు భారి సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా కాగ్రెస్ పార్టి అద్యక్షుడు టి.రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టి మ్యాజిక్ ఫిగర్ చేరుకుంటుందని ఆయన అన్నారు. రాహుల్ గాంధి పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని రైతులు, నిరుపేదలు అభివృద్ధి సాదించాలంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టిని గెలిపించాలని ఆయన కోరారు.

**కుల్కచర్ల మండల కేంద్రంలో**
కుల్కచర్ల మండల కేంద్రంలో డిసిసి మాజి ఉపాద్యక్షుడు బొలుసని భీంరెడ్డి, కుల్కచర్ల మండల కాంగ్రెస్ పార్టి అద్యక్షుడు బిఎస్.ఆంజనేయులు ఎంపిటిసి చెలిమిల్ల ఆనందం ముజాహిద్‌పూర్ సర్పంచ్ లక్ష్మి ఆనంద్, ప్రదాన కార్యదర్శి గోపాల్ నాయక్ పలువురు ముఖ్య నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టి అభ్యర్థి ఘన విజయం సాదిస్తుందని వారు ఆశాబావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


కుల్కచర్లలో జోడో యాత్రకు బయలుదేరిన కాంగ్రెస్ పార్టి నాయకులు.

## దొంగయెన్కెపల్లి పాఠశాల విద్యార్థులతో మండల విద్యాధికారి


పాఠశాల విద్యార్థులతో మండల విద్యాధికారి హరిశ్చందర్

**దోమ.అక్టోబర్ 28 ప్రబాతవార్త :**
మండల పరిధిలోని దొంగయెన్కెపల్లి పాఠశాలను శుక్రవారం దోమ మండల విద్యాధికారి హరిశ్చందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి విద్యార్థులతో ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాంపై విద్యార్థుల సామార్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చెయ్యాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచుటకు, తరగతి ప్రణాలిక, టిఎల్ఎమ్ బోదన చేయాలని ఉపాద్యాయు లకు తెలిపారు. విద్యార్థులకు మద్యాహ్నబోజనం నాణ్యతతో అందించుటకు ఉపాధ్యాయ బృందం తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులువీరప్ప, మల్లమ్మ, లక్ష్మణ్, సిఆర్‌పి వెంకటేశ్, పాల్గోన్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

**-ఎస్సై రవిగౌడ్**

**కొడంగల్,అక్టోబర్ 28ప్రభాతవార్త**
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 30న కొడంగల్‌లో నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎస్సై రవిగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...రక్తదానం మహాదానమని, రక్తదానం మరొకరికి ప్రాణదానంగా నిలుస్తుందని, ఇందుకుగాను పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి ఆదేశాల మేరకు కొడంగల్ పోలీసుస్టేషన్ పరిధిలోని రాఘవేంద్ర ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 30న ఆదివారం ఉదయం 9గంటలకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకుగాను మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు, పురప్రముఖులు, పోలీసు వాలీంటర్లు, యువజన సంఘాల యువకులు, కుల సంఘాలు, లారీ ఆటో యునియన్ నాయకులు, కార్మిక కర్షకులు, వ్యాపా రస్థులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు.

## భారత్ జోడోడ యాత్రను విజయవంతం చేయాలి

**తలకొండపల్లి అక్టోబర్28,ప్రభాతవార్త :** రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేష్ పేర్కొన్నారు. శనివారం ఏనుగొండ నుండి జడ్చర్ల వరకు భారత్ జోడో యాత్ర కొనసాగనుందని కావును తలకొండపల్లి మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యు నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి భారత్ జోడోయాత్రను విజయవంతం చేయాలని ఉదయం 10 : 30 నిమిషాలకు మండలంలోని అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వెల్జాల్ గ్రామానికి చేరుకోవాలని గుజ్జల మహేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మహేష్